# "ఇప్పుడు వీస్తున్న గాలి!"

రెండు బారల పొద్దెక్కింది. రామాలయాని కెదురుగావున్న రావిచెట్టు కింద రచ్చబండమీద, ఊళ్ళోని పెద్దబొర్రలు – ఓ కోరమీసం, ఓ కోరతలపాగ, ఓ కళ్ళజోడు చేరాయి. కళ్ళజోడు కరణం, పొన్నుకర్ర మునసబు కోసం ముక్కుమీదికి జారిన కళ్ళజోడు పైనుంచి వచ్చేపోయేవాళ్ళని పరిశీలనగా చూస్తున్నాడు.

అంతలో పొన్నుకర్రా రానేవచ్చింది.

"ఏమయ్యా! ఓపక్క నిన్ననగా కొంప లంటుకున్నాయి గదా, నీకు యింట్లో నిద్రెలా పడుతోందయ్యా?" అన్నాడు కరణం, మునసబుతో.

"నిన్ననగా అంటుకున్న కొంపలు యింకా ఆరిపోలేదా?"

"ఆరిపోవడం కాదు. రాజుకుంటున్నాయి. రాజుకుని రాజుకుని వూరునే తగలబెట్టేలా వున్నాయి. యింతకీ ఆ ప్రెసిడెంటు వూడిపడ్డేం!"

"కబురంపేను వస్తూనే వుంటాడు," అంటూ కరణం పక్కనే కూర్చుంటూ చుట్టతీసి ముట్టించాడు మునసబు.

పొడుం దట్టించాడు కరణం.

కోర తలపాగాల్లోంచి చుట్ట తీసి సుతకొరికి, తుపుక్కున వుమ్మేసి, "కాతంత నిప్పియి, మావా," అన్నాడు కోరతలపాగ మునసబుతో.

"మన కరణంగారి నడుగు."

"నా దగ్గర నిప్పెందు కుంటుందయ్యా పొడుం పీల్చుకునే వాడినైతేను," అన్నాడు కరణం.

"మీరు తలుచుకుంటే ఎంతసేపట్లో పుడుతుంది నిప్పు!" అన్నాడు మునసబు ఛలోక్తిగా.

'చాల్చాల్లే! మనలో మనకి ఫరవాలేదు గాని, ఎవరేనా వింటే నిజమనుకునేరు!'

"ఎవరికీ తెలియకపోతేగా బావగారు?" అన్నాడు మునసబు నవ్వుతూ.

ఇంతలో ప్రెసిడెంటు ప్రకాశాన్ని చూసి, "అదిగో యిటే వస్తున్నాడు. సంస్కర్త!" కాస్త బింకంగా మాట్లాడి, "యీవేళ అటో యిటో తేల్చేసుకోవాలి," అన్నాడు కరణం చుట్టూవున్న మోతుబరుల్ని వుద్దేశించి.

"అదేదో నువ్వే కానీయవయ్యా, నీమాట మేము కాదంటేగా?" అన్నాడు మునసబు.

కోరమీసం సుబ్బన్న, కసిగా మీసాన్ని మెలిపెడుతున్నాడు.

దగ్గరకొచ్చిన ప్రకాశాన్ని "రా, ప్రకాశం; రా! యిలా కూర్చో," అంటూ అప్యాయాన్ని ఒలకబోస్తూ తన పక్కనే చోటిచ్చాడు కరణం.

"పెద్దలంతా ఒకేసారి జమయ్యారు. ఏమిటో విశేషం?" అంటూ కరణం పక్కనే కూర్చున్నాడు ప్రకాశం.

"నీకు తెల్దేటి ఎందుకు జమయ్యారో?" అన్నాడు కోరమీసం సుబ్బన్న.

"అది సరేకాని, అసలు జరిగిన గొడవేమిటోయ్, ప్రకాశం?" అన్నాడు కరణం – పద్మవ్యూహానికి అంకురార్పణ చేస్తూ.

"గొడవేముందండి! నిన్నంతా వర్షం కదా, వీధులన్నీ బురదగా వున్నాయి. పొరుగూరునుంచి వచ్చిన కుర్రాడెవడో మన గుడిపక్కనే వున్న ఆ పంపుదగ్గర కాళ్ళు కడుక్కుంటూ వుంటే, "ఎవరు నువ్వు?" అని అడిగాట్ట సుబ్బన్న. ఆ కుర్రాడు, "అప్పాలు మేనల్లుడనండి" అని చెప్పాడట.

"అప్పాలంటే ఎవరు? మన మాలపల్లిలో అప్పాలేనా?" అనడిగాడు కరణం.

"అడే," అన్నాడు సుబ్బన్న వెటకారంగా.

"మాలాడివి! గుడిపంపు దగ్గర కాళ్ళుకడుగుతావా? వళ్ళు పొగరెక్కిందేట్రా?" అని సుబ్బన్న కేకలేశాడట. వాడు బస్తీకుర్రాడు కావటంతో, "మావాళ్ళంతా గుళ్ళల్లోకే ఎడతావుంటే, గుడి పంపుకాడ కాళ్ళు కడుక్కుంటే తప్పేంటండీ?" అని ఎదురు చెప్పాడట. దాంతో మాటామాటా పెరిగి సుబ్బన్నకి కోపం వచ్చి, ఆ కుర్రాడ్ని నాలుగందుకున్నాడట."

అలా జరిగిన విషయం క్లుప్తంగా వివరించాడు ప్రెసిడెంటు. "అడతో ఆగిపోతే గొడవే వుండేటి? ఆ తరవాత జరిగిన సంగతేటో అడగండి," అన్నాడు సుబ్బన్న వుక్రోషంగా.

"ఆ తరువాత మాలపెద్దలు – వీరుడు, పుత్రయ్య, మాలపల్లి మెంబర్లు సోమయ్య, దావీదు – ఆ కుర్రాడ్ని అప్పాలుని వెంటబెట్టుకుని, నా దగ్గరకొచ్చి తగువుపెట్టారు. నేను మన సుబ్బన్నకి కబురంపి, జరిగినదంతా తెలుసుకొని, దేశంలో చాలాచోట్ల దేవాలయాల్లోకి హరిజన ప్రవేశం ఏనాడో జరిగిపోయింది, గుడి ముందున్న నీళ్ళపంపు దగ్గర హరిజనుడొకడు కాళ్ళు కడుక్కుంటూ వుంటే కొట్టడం తప్పు, యింకెప్పుడూ అలా చెయ్యకు. యీసారెప్పుడేనా యిలాంటి దేదేనా జరిగితే జరిమానా వేయాల్సి వస్తుందని మందలించా సుబ్బన్నని. వాళ్ళకి నచ్చజెప్పి వెళ్ళిరమ్మన్నాను," అని చెప్పాడు ప్రకాశం.

"అక్కడితో వాళ్ళు తృప్తిపడ్డట్టున్నారు," అన్నాడు మునసబు అరిపోయిన చుట్టని ముట్టిస్తూ.

"లేదండి, మేమూ గుళ్ళో కెడదా మనుకుంటున్నామండి. మీరు దగ్గరుండి మమ్మల్ని గుళ్ళోకి తీసుకెళ్ళాలి అన్నారు వాళ్ళు," అని చెప్పాడు ప్రెసిడెంటు ప్రకాశం.

"మీరు సరేనన్నారు!" అన్నాడు కరణం వ్యంగ్యంగా.

"లేదండి, నలుగురి పెద్దలతోటి చెప్పి చేద్దాం. కాస్త ఆగండి. తొందరపడకండి. మీ కోరిక సబబైనదే," అని చెప్పి వాళ్ళను పంపించేశాను.

"మొత్తానికి వచ్చేసారికి కూడా ప్రెసిడెంటు కావడానికి పునాదులు వేసు కుంటున్నావు! ఏదో అనుకున్నానుగాని ఘటికుడివే," అన్నాడు కరణం నవ్వుతూ.

ప్రకాశానికి వళ్ళు మండింది.

"కరణంగారూ! యీ పదవి నాకు కావాలని పోటీ చేయలేదు, మీరంతా కలసి నన్ను ప్రెసిడెంటుగా వుండమని బతిమిలాడితే సరేనన్నాను. అది మాత్రం మరచిపోకండి," అంటూ చర్రున లేచి వెళ్ళబోయాడు ప్రకాశం.

"ప్రకాశం! ఆగవయ్యా, అంతకోపం ఎందుకయ్యా, కరణంగారు పరాయివాడా మనకి? ఆగు," అని మునసబు ప్రకాశాన్ని ఆపుచేసి కూర్చోబెట్టాడు.

కరణంగారు ఓ విషపు నవ్వు నవ్వుకొన్నారు. పొడుం గట్టిగా పట్టించారు.

"ప్రకాశం! అంతకోపం ఎందుకయ్యా నామీద? పదివేలకి నువ్వే ఎప్పుడూ ప్రెసిడెంటుగా వుండాలని కోరుకునేవాళ్ళలో - నేను మొట్టమొదటి వాడ్ని," అని సుబ్బన్న వైపు చూశాడు కరణం.

సుబ్బన్న తుపుక్కున వుమ్మేశాడు.

కరణంగారు మళ్ళీ నవ్వుకుని, "నిన్నసలు ప్రెసిడెంటుగా ఎందుకు చేశామంటావు, ప్రకాశం? మనవాళ్ళు జుట్టూజుట్టూ పట్టుకుని వీధినపడి పోటీలకి దిగితే; వసుదేవుడెళ్ళి గాడిద కాళ్ళట్టుకున్నట్టు ఓట్లకోసమని యీ లేబరు కాళ్ళావేళ్ళా పడాలనే కదుటయ్యా? అటువంటి పరిస్థితే వస్తే వూరు కట్టుబాటు దెబ్బతింటుందని, చిన్నవాడివైనా - చదువుకున్నవాడివి, బుద్ధిమంతుడివి, తెలివైన వాడివి అనీ, వూరు కట్టుబాట్లు ఆచారాలు జాగ్రత్తగా నిలుపుకొస్తావనే కదుటయ్యా నిన్ను ప్రెసిడెంటు చేసింది? ఔనా?" అన్నారు.

"ఔననుకోండి."

"ఔనా! మరి నువ్వు సుబ్బన్నని పిలిపించి ఆ మాలాళ్ళముందు మందలిస్తే, అతని మనసు ఎంత క్షోభిస్తుందో ఆలోచించావా? అతని తాత, ఏదేనా తగువువస్తే నడివీధిలో తన్నేవాడు మాలాడ్ని. వాళ్ళ నాన్న అంతే. అనాడు ఎవడేనా నోరెత్తేవాడా? అప్పీలుండేదా? యితను మాత్రం? నీకు ముందు అతనేగా ప్రెసిడెంటు? అతని హయాంలోనూ అంతే! అటువంటి మనిషి ఏదో ఎవడ్నో రెండు తన్నే, దానికింత రాద్ధాంతం చేస్తే, అతనెంత బాధపడతాడంటావు? పైగా వాళ్ళు గుళ్ళోకెళ్ళడం సబబేనని వాళ్ళని నువ్వే వెనకేసుకొస్తే ఎలా చెప్పు? వూరు కట్టుబాట్లు ఆచారాలు, పద్ధతులు ఏమైపోవాలి? - వాళ్ళ కట్టుబాట్లు వాళ్ళు వదులుకుంటారా? అందాకా ఎందుకు? వాళ్ళడుగెట్టిన గుళ్ళోకి మీ అమ్మగారు వెడుతుందేమో కనుక్కో."

"ఏది ఏమైనా. వెనకటిరోజులు ఎలా జరిగిపోయినా, కాలాలు మారుతున్నప్పుడు మనంకూడా మారాలి కదండి?"

"బలే వాడివయ్యా! గాలెటువీస్తే అటుపోయే గాలిపటంలా, కాలంతోబాటు మనమూ మారితే యిక మన ప్రత్యేకతేముందయ్యా? కాలాన్ని మనం మార్చాలిగాని, మనం కాలానికనువుగా మారిపోతే యెలా? నీకింకా చిన్నతనంలే. తెలీదు పాపం. నీకు - అంటూ సొంటూలేదని, నువ్వు వాళ్ళతో కలిసిమెలిసి తిరుగుతావని నాకు తెలుసు. ఎవరిమట్టుకు వాళ్ళు ఎలావున్నా ఫరవాలేదుగాని, వూరందరికీ సంబంధించిన విషయంలో మాత్రం జాగ్రత్త. ముందుచూపు అవసరం, ప్రకాశం," అని తెలివిగా, మృదువుగా ఉపన్యసించాడు కరణం.

"వాళ్ళన్నదీ సబబేగదండి? గుడి ముందు పంపు దగ్గర కాళ్ళు కడుక్కుంటే ఏం పోయింది? నీళ్ళు మలినాన్ని కడుగుతాయిగాని, నీళ్ళు మలినమైపోవు గదండీ?"

"వాదన కంతేముంది చెప్పు? ఆ మాటకొస్తే వాళ్ళకు మాలపల్లిలో వేరే గుడి వుంది. వాళ్ళగుడి వాళ్ళకుండగా మన గుడితో వాళ్ళకేంపని చెప్పు, పొగరుమోత్తనం కాకపోతేను..." అని యింకా ఏదో చెప్పబోతూండగా మాలపెద్దలు, మాలపల్లి మెంబర్లు, మరో పదిమంది కలిసి అక్కడకే వచ్చారు.

"అరుగో వచ్చేశారు మాటల్లో. ఏరా పుల్లయ్యా! అంతా కట్టగట్టుకొచ్చారు? యిప్పుడే వెడదామనా గుళ్ళోకి?" అన్నాడు కరణంగారు సూటిగా.

"అబ్బే! తవరందరితో సెప్పినాకే యల్లామని వప్పందం చేసుకున్నావండి పెసిడెంటు గోరికాడ." అన్నాడు పుల్లయ్య.

"ఒరేయ్! నేనోమాట చెబుతా వినండ్రా! మనం యిన్నాళ్ళూ తల్లీ పిల్లాన్యాయంగా పోతున్నాం. మా కట్టుబాట్లు, ఆచారాలు మాకున్నాయి. మీ కట్టుబాట్లు, ఆచారాలు మీకున్నాయి. మీకు వేరే గుడి ఉంది. వూళ్ళో గుళ్ళో కెడితే ఒరిగేదేమిట్రా మీకు, నాకు తెలీకడుగుతాను?"

"నిజమేనండి, అన్నిసోట్లా మావాళ్ళు గుళ్ళల్లోకి యడతావుంటే, యీడ నీళ్ళపంపు ముట్టుకుంటేనే తన్నులు తినాల్సివత్తంతోటి, మావాళ్ళంతా అట్టా నిరనయం సేసుకున్నారండి."

"అయితే తప్పదన్నమాట?"

"అనే మా వోళ్ళంటన్నారండీ."

"సరే అయితే, మీ సరదా నేనెందుక్కాదనాలి? ఏదో మంచిరోజు చూసుకుని అల్లాగే కానివ్వండి. వూరికే తొందరపడి దూరకండి. బెడిసి కొడుతుంది. లేనిపోనిది మీరు పాడైపోయినా మా మనసొప్పదు. యింక పోయిరండి - పదండయ్యా, యిక వెడదాం. మనవూరూ ముందుకొస్తోంది, లేవండి," అంటూ లేచాడు కరణం.

వెనకే మునసబు, సుబ్బన్న వెంటపడ్డారు. మిగిలినవాళ్ళు ఎవరిదారిన వాళ్ళు వెళ్ళిపోయారు.

ప్రకాశం, మాలపెద్దలు యీ విషయం అంత సులువుగా తేలిపోయినందుకు మనసుల్లోనే సంతోషించారు.

మునసబు, కరణం, సుబ్బన్న, మునసబు గారింటి దగ్గిర బిచాణా వేశారు.

"గుళ్ళోకెడతం అంత సులువేం? రానీ. ఒక్కొక్కడి పుచ్చే ఎగరకొడతాను," అన్నాడు సుబ్బన్న మీసం మెలిపెడుతూ.

"సుబ్బన్నా! యిలాంటి విషయాల్లో ఆవేశం కాదయ్యా కావలసింది, ఆలోచన. ఏమీ చెయ్యకుండానే, ఎప్పుడో ఏదో చేశారని, అక్కడక్కడ మనలాంటివాళ్ళ పుచ్చెలు ఎగిరిపోతూవుండటం మనం వింటూనే ఉన్నాం. ముఖాముఖీని నిలబడి పుచ్చెగరగొడతానంటే మన పుచ్చెలుంటాయా? అమాయకుడ! అసలింతకీ ప్రకాశాన్ని ప్రెసిడెంటు చేయడం పొరబాటైపోయింది," అంటూ హితవు చెప్పాడు కరణం.

"వాడి పేరుకోసం వాడేడుస్తున్నాడు. పెద్ద సంస్కర్త అయిపోదామని," అన్నాడు మునసబు.

"వెనకటికి మావాడే ఒకడు, పదహారణాల బ్రాహ్మడు, మాలపల్లి అని నవలరాసి, దానికి మాలాడిని నాయకుడ్ని చేశాడు. మావాళ్ళంతా దవడలు నొక్కుకున్నారు. అంతరాయాలనే ఉంటే ఏ భారతమో, రామాయణమో తిప్పిరాయకూడదా? లేకపోతే యేశతకమో రాయకూడదా? ఎవరికీ ప్రమాదం లేంది. ఇబ్బంది లేందీను. కీర్తి..." అని యింకా యేదో చెప్పబోతున్నాడు కరణం.

"యీ సొదకేం లేవయ్యా? యిప్పుడేం చేద్దామంటావు? వాళ్ళని గుళ్ళోకి వెళ్ళనివ్వడమేనా? మనం చేయగలిగిందేమైనా ఉందా?" అని మునసబు అడ్డు తగిలాడు.

"అదంత సులువా? ముందు మన నౌకరును పంపి మాదిగాళ్ళని పిలిపించు."

"వాళ్ళెందుకు?"

"చెబుతాగా."

"సరే,"నని మునసబు మాదిగలకి కబురుచేశాడు.

నౌకరు మాదిగపల్లివైపు బయలుదేరాడు. మాలపల్లికి యింకా ఒక ఫర్లాంగు దూరంలో మాదిగపల్లి ఉంటుంది. మాలపల్లి నూతిపక్కనుంచే వున్న పుంతదారిని వెళ్ళాలి. మాదిగపల్లి దగ్గరలో, పుంతలో చచ్చిపడున్న ఎద్దు కళేబరం నుంచి ఒలుపుడుతో చర్మాన్ని వలుస్తున్నాడు మాదిగపెద్ద అప్పిగాడు.

"మునసబుగోరు మీ పెద్దల్ని రామంటున్నారు," అన్నాడు నౌకరు.

"నెలనగా సెప్పులజత కుట్టమన్నారు మునసబుగారు. శరమంలేక కుట్టనేకపోనాను. యేంతంటా వత్తదో?" అనుకుంటూ కంగారుగా లేచాడు అప్పిగాడు.

"అందుక్కాదులే ఏదో పనిపడ్డట్టున్నాది. బేగిరండి," అని చెప్పి నౌకరు వెళ్ళిపోయాడు.

మాదిగ పెద్దలు తొందర తొందరగా వచ్చి, మునసబుగారి వీధి గుమ్మంలో అరుగులకి దూరంగా చేతులు కట్టుకు నిలబడ్డారు.

"అలా దొడ్డివెంపు రండ్రా," అని ఆజ్ఞ జారీచేసి పెరట్లోకి దారితీశాడు కరణంగారు. వెనకే మునసబు సుబ్బన్న బయలుదేరారు.

మునసబుగారి పెరట్లో గొడ్లసావిడ దగ్గర మాదిగలు క్రింద కూర్చున్నారు. కవాచీ బల్లమీద కరణం, మునసబు, సుబ్బన్న కూర్చున్నారు.

కరణంగారు పొడుం దండీగా దట్టించి –

"ఏరా అప్పిగా! ఎన్నాళ్ళైనా యిలా ఎదుగూ బొదుగూ లేకుండా ఉండి పోవడమేనా మీరు? బాగుపడదా మనుందా?" అన్నాడు కరణం.

"ఎట్టా, బాబయ్యా! సెప్పులు కుట్టుకు బతికేవోళ్లం. ఎట్టా బాగుపడతావండా?"

"దానికీ మార్గాలున్నాయి. చెప్పులు కుట్టుకునే వాళ్ళకికూడా ఈ రోజుల్లో ప్రభుత్వం పెట్టుబడిపెట్టి అప్పులిచ్చి సొసైటీలు పెట్టించి సహాయం చేస్తోంది. ఆ డబ్బు తెచ్చుకుని మీరంతా కలసి మిషన్లు అవీ కొనుక్కొని భారీ ఎత్తున చెప్పులు తయారుచేస్తే బాగుపడరటరా? అసలు మీకా శ్రద్ధేడిస్తేగా?"

"మాకేటి తెలుత్తాదండా? ఈయాల మీరు సెపుతావుంటే యింటున్నాం. అచ్చరం ముక్క రానోళ్ళం కదండి బాబు."

"మేం లేవట్రా! అందరూ వేలిముద్ర లేసి కాగితాలివ్వండి నాకు," అని మునసబువైపు చూశాడు కరణం.

"అమ్మ కరణం! అక్కడారిపోయాయనుకున్న కొంపలు – యీ మూలనుంచి రాజబెడతున్నావా?" అన్నట్టు చూశాడు మునసబు.

ఆ చూపులోని అభినందనని గ్రహించిన కరణం, "ఆc, అది సరే కాని, మీరంతా ఐకమత్యంగా ఉండాలిరా. మన మాలాళ్ళు రెండుమూడు రోజుల్లో వూళ్ళోగుళ్ళో కెడుతున్నారు. మీరూ వాళ్ళతోపాటే వెళ్ళాలి. దేశం ముందుకు పోతోంది. మీరూ చురుగ్గా వాళ్ళతో కలవాలి. అన్నట్టు అసలు విషయం మరచాను – వాళ్ళసలు మిమ్మల్ని దగ్గరకు చేరనివ్వరనుకుంటాను?" అన్నాడు.

"అనుకోటవేటండా? అళ్ళనూతిలో నీళ్ళు కూడా తోడుకోనివ్వరు మమ్మల్ని, మొన్న లేసంగిలో కాలవకాడకెళ్ళి గోతులు తవ్వుకొని కుండెడు కుండెడు నీళ్ళు తెచ్చుకున్నాం బాబయ్య," అన్నాడు వాళ్ళలో ఒకడు.

"యింకా బాధ అక్కరలేదురా. మీరూ అన్ని పంపులు ముట్టుకోవచ్చు. అన్ని నూతులూ ముట్టుకోవచ్చు. మళ్ళీ తరువాత గొడవెందుకు? పనిలో పని అయిపోతుందీ – మీరు యీవేళ రాత్రికే మాలపల్లి నూతిలో నీళ్ళు తోడుకోండి. అంతా కలసి దేనికైనా సిద్ధమై రండి? అసలు వాళ్ళేమీ అడ్డు చెప్పరులే. వాళ్ళంతా మా గుళ్ళో కెడుతున్నారుగా. మీరు వాళ్ళ నూతిలో నీళ్ళు తోడుకోవడం తప్పేం కాదులే..."

"గొడ వవుద్దేమో నండయ్యగోరా?"

"నీ మొఖం. మేవంతా లేవట్రా? యీ మాత్రానికే భయపడితే, మీకు సొసైటీ ఎలా వస్తుందిరా? రేపు ఆఫీసరొస్తే మీ గుడిశెల్లో కొచ్చి కూర్చుంటాడు. రోజులు మారాయిరా. తప్పేమీ లేదు. ముందుకు దూసుకుపోవాలి మీరూను. ఏమంటావు, మునసబు?"

"నిజమే. భయమెందుకురా?" బలపరచాడు మునసబు.

దాంతో వాళ్ళంతా, "మాకేటి బయవండా?" అన్నారు ముక్తకంఠంతో.

"సరే. యీరాత్రికలా కానిచ్చెయ్యండి," అని చెప్పి మాదిగాళ్ళని పంపేశాడు కరణం.

"అయితే మాలాళ్ళు మన గుళ్ళోకి వెళ్లడానికి ముందే, మాదిగాళ్ళు మాలాళ్ళ నూతిలో నీళ్ళు తోడకోడంతో రావణాసురుడికాష్టం రాజు కుంటుందన్నమాట. మొత్తానికి ఘటేవాడివయ్యా బావగారు." అని నవ్వుకున్నాడు మునసబు తృప్తిగా.

"కరణంగారి బుర్రంటె యేటి మరి?" అన్నాడు సుబ్బన్న.

"అరికాల్లో తుమ్మముల్లు విరిగితే బంగారపు పిన్నుతో తీయడం దేనికి? ముల్లును ముల్లుతోనే తీయాలి. వాళ్ళు మన గుళ్ళోకి వస్తూ వుంటే మనం ఎదురుతగలటం దేనికి? మాలాళ్ళకి మాదిగాళ్ళను తగిలిస్తే, వాళ్ళ నూతి దగ్గరే బుర్రలు పగుల్తాయి – మాలపల్లి నూతిలోని నీళ్ళు ఎరుపెక్కుతాయి. గుళ్ళోకి వెడదామనుకుంటేనే యింత బెడిసికొడితే, నిజంగా వెడితే ఎంత బెడిసి కొడుతుందోనని, తోకముడుస్తారు వెధవలు–"

"చహబాష్, బావగారు, కృష్ణపాత్ర ధరించి కురుక్షేత్రం సృష్టిస్తున్నారు."

"సహవాసదోషం! నువ్వూ గ్రహించావు, మునసబు."

"నాకేవీ అరదం కావటంలేదు," అన్నాడు సుబ్బన్న తెల్లమొగం వేసి.

"మరేం లేదు. నూతిదగ్గర పుట్టిన కొట్లాటలో బుర్రలు పగుల్తాయి. కోర్టుల కెక్కుతారు. వాళ్ళలో ఓ పార్టీ దీపం చుట్టూ తిరిగే పురుగుల్లా మనచుట్టూ తిరుగుతారు, వాళ్లే ప్రకాశం పనికూడా పట్టొచ్చు – అది సరే? మునసబూ! తెల్లవారేసరికి పోలీసు స్టేషనుకి ఒకీరురాసి సిద్ధంగా వుంచు, నేవిక వస్తా, ఆఁ చూడు, సుబ్బన్నా! మీసాలింకా నలిపెయ్యకు, విశ్రాంతి తీసుకో. అది సరే కాని, మా చేలో అకు తక్కువై వూడుపు ఆగిపోయిందట. నీ దగ్గరేమైనా మిగిలితే పంపించు," అని కరణం లేచాడు.

"కావలసినంతుందయ్యా! సందాలకి పంపుతా నెల్లండి," అని సాగనంపాడు సుబ్బన్న.

అదేరోజు రాత్రి ఎనిమిది గంటలకి ప్రకాశం పొలం నుంచి యింటికి తిరిగివస్తున్నాడు. మాలపల్లి నూతిపక్క నుంచున్న పుంతదారినే రావాలతను. దూరానికే అతనికి ఏవో కేకలు వినిపించాయి. అతను చురుగ్గా నడిచి మాలపల్లి నూతి దగ్గరికి చేరాడు. నూతి దగ్గర జనం గుమిగూడారు. ఘర్షణపడుతున్నారు. కేకలేసుకుంటున్నారు. ప్రకాశం వాళ్ళ మధ్యకెళ్ళి, "ఆగండి. ఏమిట్రా గొడవ?" అన్నాడు.

"ఏముందండా? మాదిగోళ్ళొచ్చి మా నూతిలో నీళ్ళు తోడుకుంటావంటున్నారు. పైగా కర్ర లేసుకొచ్చారు. సూత్తన్నారుగా?" అన్నాడు మాలపెద్ద పుత్రయ్య.

"మీరు నీళ్లు తోడుకోందుకు వీల్లేదన్నారు?" అన్నాడు ప్రకాశం.

"ఔనండి, మా వోళ్ళూ కర్రలేసుకొచ్చారు. మీరు వూళ్ళో గుళ్ళో కెడితేలేంది మేవ్ మీ నూతిలో నీళ్ళు తోడుకుంటే తప్పా? అంటన్నారండోళ్ళూ" అన్నాడు పుత్రయ్య.

"సరే ఏరా! మీరరు కరణంగారిని కలిశారా యీవేళ?" అన్నాడు ప్రకాశం మాదిగల నుద్దేశించి.

"చిత్తం," అన్నారు వాళ్ళు.

"సరే, నాతోరండి," అని మాలల్ని, మాదిగలని వెంట తీసుకొని తన యింటికొచ్చాడు.

వాళ్ళందరినీ పెరట్లోకి తీసుకెళ్ళాడు. నూతి చప్టాదగ్గర నిలబడి, "మీరంతా కలిసి మా నూతిలో నీళ్ళుతోడుకోండ్రా. మీరు చెరోబాల్చీడు నీళ్ళూ తీసి నాకివ్వండి. నాకు దాహంగా వుంది," అన్నాడు ప్రకాశం.

వాళ్ళంతా ఒక్కక్షణం మౌనంగా వుండిపోయారు. ఆ మాటలు ప్రకాశం పట్ల వాళ్ళకున్న గౌరవాన్ని అభిమానాన్ని పెంచాయేగానీ, వాళ్ళ నరనరాల్లో జీర్ణించుకొనివున్న ఆచారాన్ని తుంచివెయ్య లేకపోయాయి.

ఆ విషయం ప్రకాశానికి త్వరగానే అర్ధమయింది. కరణం కుట్రని వాళ్ళకు చెప్పాలనుకున్నాడు. సాధ్యమైనంతవరకు విశదీకరించి చెప్పాడు. "యీ పెద్దలు, పెద్దరికాలు మిమ్మల్ని విడదీసి పాలించి, వాళ్ళ గుప్పిట్లో పెట్టుకుని మిమ్మల్ని ఎక్కడున్నారో అక్కడేవుంచి, వాళ్ళ స్థానాన్ని నిలుపుకుందుకే. ఉపకరిస్తాయి. అంతేగాని మిమ్మల్ని ఉద్ధరించడానికి మాత్రం కాదు. ఊఁ, కానివ్వండి, మీరు నీళ్ళు తీసి నాకివ్వండి," అన్నాడు ఆవేశంతో ప్రకాశం.

వాళ్ళంతా చలించారు. వాళ్ళ పొరపాటును వాళ్ళు తెలుసుకున్నారు. "పొరపాటై పోయింది, బాబు - అళ్ళని మా నూతిలో నీళ్ళు తోడుకోమనండి," అన్నాడు పుత్రయ్య.

ప్రకాశం మనసు పొంగిపోయింది. "ఏ దేశంలో అయినా వున్న కులాలు రెండేరా. ఉన్నవాళ్ళు, లేనివాళ్ళు. మిగిలిన కులాలన్నీ పోవాలి. ఆ రోజు వస్తేనే మీరు బాగుపడేది. పొద్దున్నే అంతా రండి, గుళ్ళోకెడదాం. నేను తీసుకెడతాను మిమ్మల్ని," అన్నాడు ప్రకాశం.

తెల్లవారింది. మాలపల్లి, మాదిగపల్లి ప్రకాశం ఇంటిముందు చేరాయి, ప్రకాశం ముందు నడిచాడు. గుడిముందు పెద్ద తీర్థంలా తయారయ్యింది. గుడి ముందున్న పంపుదగ్గర జనం కాళ్ళు కడుక్కుంటున్నారు.

ఏం జరుగుతుందో చూద్దామని వచ్చిన జనం ఏమీ జరగకపోవడంతో కళ్ళప్పగించి చూస్తున్నారు.

పొన్నుకర్ర, కోరమీసం, కరణం రచ్చబండమీద కూర్చున్నారు.

గుడిగంట ఎడతెరిపి లేకుండా మోగుతోంది. అందరూ దేవుడ్ని దర్శనం చేసుకుంటున్నారు.

ఎదురుగా రచ్చబండమీద కూర్చున్న కళ్ళజోడు, కోర తలపాగ, కోరమీసం, పొన్నుకర్ర, బస్తీ దేవుళ్ళకులాగే మన దేవుడికీ పవరుపోయింది, వర్ణసంకరం అయిపోయాడు, అనుకొని ఎవరి దారిని వాళ్ళు వెళ్ళిపోయారు.

కాని ఫలితం ఏమిటి...?

గుళ్ళోదేవుడు గుళ్ళోనే ఉన్నాడు.

మాదిగపేటలో మాదిగలు మాదిగపేటలోనే ఉన్నారు.

మాలపల్లి మాలలు మాలపల్లిలోనే ఉన్నారు.

వూళ్ళో పెద్దలు వూళ్ళోనే ఉన్నారు.

ప్రకాశం తన యింట్లోనే ఉన్నాడు.

మార్పేమీ లేదు. మార్పుకిది చాలదేమో అనుకున్నారు వాళ్ళలో కొందరు. మార్పుకిది మార్గం కాదేమోనని ఆలోచించడం మొదలెట్టాడు ప్రకాశం.

★ ★ ★